# పెసరల్ ఇన్‌సైడ్

– పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

అలాంటి పెళ్లి చూపులు ఏ పెసర లోకంలోనూ జరిగి వుండవు. గోపేశ్వరరావు గారిది ముచ్చటైన పెసరాభిరుచి గల కుటుంబం. భార్య తిలకానికి ఏడు పెసర గింజల బరువు గల వజ్రాలు చేయించాడు. 25 సంవత్సరాలుగా కొడుకు పెసరేశ్వరరావుకి కంప్యూటర్ విద్యతోబాటు అన్ని పెసర అధ్యయనాలూ ఏర్పాటు చేశాడు. పెసరేశ్వరరావు కూడా తండ్రి మాట మీరలేదు. అన్ని పెసరతిళ్లూ తిన్నాడు. అన్ని పెసర గ్రంథాలూ చదివాడు. ప్రొద్దుటే కాఫీ బదులు పెసరకట్టు సేవిస్తాడు. కంప్యూటర్ చదువులో పైకి వచ్చి ఎన్ని దేశాలు చుట్టివచ్చినా పెసర ధ్యానం మరచిపోలేదు. అతని పెసరానురాగానికి ఎల్లలు లేవు. కంప్యూటర్ ద్వారా పెసర సేవ చేయడంలో అతనికి వచ్చిన పేరు అంతా ఇంతా కాదు. పెసరలాండు దేశంలో పెసరెక్సు ప్రాజెక్టులో పనిచేసి పెసరల్ ఇన్‌సైడ్ 4–వెర్షన్ కనిపెట్టాడు. అందువలన పెసరేశ్వరరావుకి అమెరికాలో మిచిగన్ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల విద్యార్థి వేతనం లభించింది. అక్కడ కూడా అతనికి పెసర ధ్యాస తప్ప మరొకటి లేదు. పెసరాకిల్ 0.4 అనే సంవేదన శీలమైన కంప్యూటర్ భాషను కనుగొన్నాడు.

ఆ భాష చాలా ప్రత్యేకమయినది. బడుగు దేశాలలో బీదవారికి ఎంతో బలమిచ్చే సాంఘిక ప్రయోజనం గల భాష. అంటే కొన్ని శబ్దాల చప్పుడును. రుబ్బింగ్, కటింగ్ శబ్దాలను బైనరీ అంకెలలోకి ఆ భాష మార్చుతుంది. ఆ అంకెలు ఒక గ్రూపు క్రింద కడితే గాలి వంటి ఒత్తిడి ఏర్పడుతుంది. ఆ ఒత్తిడి వలన క్రోటను మొక్కలు కూడా పెసర గింజలను ఉత్పత్తి చేస్తాయి. ఇందువలన శీతల దేశాలలో సహితం పెసర గింజలను పండించడానికి అవకాశం కల్గుతుందని పెసరేశ్వరరావు ఒక నమూనా ప్రాజెక్టు చేశాడు. అలాంటి ప్రభావం చూపగల అతని కృషికి పెసరసే అవార్డు లభించింది. ఇప్పుడు సోమాలియా దేశం నుండి అలాస్కా వరకు పెసరేశ్వరరావు పరిశోధనను కార్యరూపంలోకి తెస్తున్నారు. పెసర పంటతో కొన్ని దేశాల ఆకలి దశలో మార్పు వస్తుందని ప్రపంచ ఆరోగ్య సమితి సహితం ప్రకటించింది.

అటువంటి పెసరేశ్వరరావుకి పెళ్లిచూపులు. తండ్రిగా గోపేశ్వరరావు పత్రికలో ప్రకటన ఇచ్చాడు. పెసరనాడు పత్రికలో పడ్డ ఆ వివాహ ప్రకటన ఇలా వుంది:

"నిత్యం పెసర ధ్యానం చేస్తూ జిహ్వా చాపల్యం కలిగి, జీర్ణశక్తి బాగా వున్న పెసర యువకునికి పెసర సంస్కారం కల్గిన కుటుంబం నుంచి అందమూ అణకువ, కంప్యూటర్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ కలిగిన వంట వచ్చిన యువతి కావలెను. వరుడు పెసర కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో ప్రతిభ కల్గిన యువకుడు. ఆస్తిపరుడు. వివరాలకు అమ్మాయి వేసిన పెసరట్టు గల ఫొటోతో సంప్రదించగలరు." –గోపేశ్వర్. ఫోను నెంబరిచ్చాడు. ఇంటి అడ్రసు ఇచ్చాడు.

గోపేశ్వరరావు ఇంటికి వచ్చిన ఫోనుల వివరాలు చెప్పాలంటే చాలా కష్టం.

ఫోనులో వ్యక్తమయిన అనుమానాలు చాలా ఉన్నాయి.

కంప్యూటర్ అమ్మాయికి పెసరట్టు గురించి తెలియాల్సిన అవసరం ఏమిటండీ అనో కన్యాదాత ఫోను చేశాడు.

"మీ అమ్మాయిని పెసలెక్సు వర్షన్ చదువుకోమనండి" అని గోపేశ్వరరావు ఫోను పెట్టేశాడు.

"మా అమ్మాయికి పెసరట్లు ఇష్టమే కానీ వేయడం రాదండి. అబ్బాయి నేర్పిస్తాడు కదా. న్యూ జెర్సీ మైక్రోసాఫ్టులో నెలకు ఆరువేల డాలర్ల జీతం" అని ఒక కన్య తండ్రి ఆశపెట్టాడు.

"మైక్రోసాఫ్టు మూలపడే సాఫ్టువేరు వస్తోంది. ఎక్కడైనా హోటల్లో అట్ల మాస్టరుగా శిక్షణ ఇప్పించండి" అని గోపేశ్వరరావు సమాధానం చెప్పాల్సి వచ్చింది.

కొందరు "పెసరధ్యానం కావాలన్నారెందుకు?" అన్నారు.

అందుకు "ఇడ్లీ నుంచి బయటపడే బుద్ధి కోసం" అన్నాడు గోపేశ్వరరావు.

ఈ గోపేశ్వర్ తండ్రి పేరేమిటి అని కొందరు వేళాకోళం చేశారు. మినప కులాలకు అర్థం కావన్నాడు గోపేశ్వర్. జిహ్వ ఎందుకన్నారు. తినడానికన్నాడు.

"జీర్ణశక్తి ఉన్న అని చెప్పారు ఎందుచేత?!" అన్నారు.

"లేకపోతే బాతురూములు ఎక్కువ కట్టించాలి కదా అందుకు" అన్నాడు గోపేశ్వరరావు.

"పొద్దుటే మా ఇంట్లో పొంగలి అలవాటు" అని నసిగారు ఒకరు.

"అన్నపన్నయ్యల కుటుంబాన్ని బాధించకుండా ఉండాలని" అలా ప్రకటించామన్నాడు గోపేశ్వరరరావు.

ఒకాయన "మాది మీలాటి కుటుంబమే. ఇదిగో ఇందులో పెసరట్టు ఫొటో జతపరుస్తున్నాను" అని రాశాడు.

గోపేశ్వరరావు చాలా ఆనందపడ్డాడు. ఈ సంబంధమంత దగ్గిరగా వచ్చినది మరోటి లేదని ఎగాదిగా ఫొటో చూశాడు. అది బ్లాక్ అండ్ వైట్ ఫొటో. గోపేశ్వరరావుకి కోపం వచ్చింది.

"మినపట్టు ఫొటో తీసి పెసరట్టు ఫొటోగా మభ్యపెట్ట కండి" అని తిరుగు టపాలో జవాబు రాసి పంపాడు.

అలా అనేక సంబంధాల మూలాలు చెడిపోయాయి. గడప దాటి రాలేదు. ఒక్క సంబంధం మాత్రం గోపేశ్వర రావు ద్వారం వద్ద పరీక్షలకి నిలబడింది.

అందుకే ఇప్పుడు పెసరేశ్వరరావు పెళ్లిచూపులు.

పెసరవరం నుంచి పెదఉప్మాక అనే వూరికి గోపేశ్వరరావు, పెళ్లికొడుకు, తల్లి తిలకం తరలి వెళ్లారు.

పెళ్లి కుమార్తె తండ్రి ఎదురు వస్తూనే పెసర తీర్థం ఇచ్చాడు. గోపేశ్వరరావు మురిసిపోయాడు. చాలా సంతోషంగా "ఎలా చేశారు?" అన్నాడు.

"అంతా అమ్మాయి పెసరలక్ష్మి పరిశోధన. పెసరకట్టులో జీలకర్ర వేయించి మరీ పంచదార కలిపింది. నాలుగు గంటలసేపు కడుపులో చల్లగా ఉంటుంది" అన్నాడు పిల్ల తండ్రి శంకరం.

తర్వాత ఆ ఊళ్లో పెసర పంట గురించి ముచ్చటించు కున్నారు. మాగాణి విస్తీర్ణం, ఎరువులు చల్లిన పెసర పంట భాగం, పురుగు మందులు, పెసర పంట దిగుబడీ– అన్నీ మాట్లాడుకున్నారు.

పెసరేశ్వరరావు వినోదంగా చూస్తున్నాడు.

"అమ్మాయిని తీసుకు రమ్మనండి" అంది పెసరేశ్వర రావు తల్లి తిలకం.

పిల్ల తండ్రి శంకరం భార్యకు సైగ చేశాడు.

"శంకరం గారూ! ఈ ఏడాది పిల్లి పెసర బాగా పండిందా!" అన్నాడు గోపేశ్వరరావు.

"మాకు పదికాళ్ల పశువులు కంటే లేవు. అందుచేత పెద్దగా పట్టించుకోలేదు" అన్నాడు శంకరం.

పెసరేశ్వరరావు తండ్రి వంక నవ్వుతూ చూశాడు.

"మా అబ్బాయి పిల్లి పెసరను కూడా మనుష్యులు తినే విధంగా చేయాలని పరిశోధన చేస్తున్నాడు. అందుకని అడిగాను" అని సర్దుకున్నాడు గోపేశ్వరరావు.

"అది బయోటెక్ ప్రాజెక్టులెండి. బర్కిలీ విశ్వ విద్యాలయంలో ప్రారంభించాం. కానీ ఏం చేస్తాం, అక్కడ గుర్రాలకి పెద్దగా అభిరుచి లేదు'' అన్నాడు పెసరేశ్వరరావు.

"అక్కడి ప్రొఫెసర్ల తీరే వేరులెండి" అని సర్దాడు శంకరం.

పెసరేశ్వరరావు నవ్వుకున్నాడు. ఈలోగా పెళ్లికూతురు పెసరలక్ష్మి వచ్చింది. సినీతార టాబూలా వుంది అనుకున్నాడు పెసరేశ్వరరావు. పెసరట్లతో పళ్లాలు కూడా వచ్చాయి.

"సేవించండి" అన్నాడు శంకరం పెసరట్ల పళ్లెం ఒకటి గోపేశ్వరరావుకి ఇస్తూ, "బాబూ నువ్వు కూడా" అన్నాడు పెసరేశ్వరరావును చూస్తూ.

"వదినగారిలా మేము వేయగలమా లేమా అని అనుమానం" అంటూ పెళ్లికూతురి తల్లి ఒక పెసరట్టు ప్లేటును తిలకానికి అందించింది.

"అబ్బాయికి నువ్వు ఇవ్వమ్మా!" అన్నాడు పెళ్లికూతురు తండ్రి శంకరం.

"అక్కర్లేదు లెండి. నేనే తీసుకుంటాను" అన్నాడు పెసరేశ్వరరావు. అనుమానంగా అట్టును అటూ ఇటూ తిప్పాడు.

"ఇన్ని పెసర మర్యాదలెందుకు వదినగారూ" అంటూ తిలకం వదినగారి కేసి చూస్తూ తినసాగింది. మళ్లీ, "చాలా బాగా వేయించారు" అంది రుచి అనుభవిస్తూ.

"లేదమ్మా! ఈ పెసరట్లు ఆవిడ వేయలేదు" అన్నాడు పెసరేశ్వరరావు. పెళ్లికూతురు ముసిముసిగా నవ్వింది.



"మరి. అచ్చం ఫొటోలో వున్నట్టుంది కదరా?" అన్నాడు గోపేశ్వరరావు.

"లేదు నాన్నా! మనకు పంపిన ఫొటోలో పెసరట్టు వేరు" అన్నాడు పెసరేశ్వరరావు.

పెసరలక్ష్మి సిగ్గుగా తలవంచుకుంది.

"నిజమే. ఈ అట్లు మా ఆవిడ వేయలేదు. అమ్మాయి పెసరలక్ష్మే వేసింది" అన్నాడు శంకరం.

''నువ్వు ఎలా చెప్పగలిగావురా?'' అన్నాడు గోపేశ్వరరావు తన అట్టు వంక చూసుకుంటూ పెసరేశ్వరరావుతో.

"సింపుల్ నాన్నా! పెసరల్ ఇన్‌సైడ్. ఏముందీ! కోతిమీ వర్షన్ ట్రైపోలార్ లీవ్స్" అన్నాడు పెసరేశ్వరరావు.

పెసరలక్ష్మి గాజుల చేతులు గలగలా కదిలాయి.

"నీకెలా తెలిసిందిరా?" అంది తిలకం పెసరేశ్వర రావుతో.

"అదేనమ్మా! నేను సిడ్నీ సమావేశంలో కొత్తిమీర ఆకులు చదునుగా మూడు శిఖరాలుగా పరచి వేయవచ్చునని పరిశోధక పత్రం చదివాను. దానిని అర్థం చేసుకుని వేసిన పెసరట్టు ఇది. పెసరల్ ఇన్‌సైడ్. అది లీవ్స్-అరకెల్ ఫాలో అయిన వారికి తెలుస్తుంది" అన్నాడు పెసరేశ్వరరావు.

"శంకరంగారు మనసారా నవ్వుకుంటూ, "అమ్మాయి ఎక్కడ ఏ వంటపత్రాన్ని అయినా డౌన్‌లోడ్ చేసి తన కంప్యూటర్‌లో భద్రపరచి ప్రయోగాలు చేస్తూ వుంటుంది" అన్నాడు.

"చూశారా! అనుకూలవతి అయిన అమ్మాయి అట్లలో దర్శనమిచ్చింది మావాడికి" అన్నాడు గోపేశ్వరరావు.

"మీరు అలా అనడం మా అదృష్టం" అంది పిల్ల తల్లి.

"అమ్మాయి చేత ఏమైనా పాట పాడించమంటారా?" అని అడిగాడు శంకరం.

"అంతకంటేనా! ఇంత పెసరట్టకం తెలిసిన పిల్లకి సంగీతమేమిటి నాట్యం కూడా తెలుస్తుంది" అన్నాడు గోపేశ్వరరావు.

"అది కాస్త మిరపకాయలు ఎక్కువయితే మనకే వస్తుంది నాన్నా" అన్నాడు పెసరేశ్వరరావు ముసిముసిగా నవ్వుతూ. శంకరంగారూ నవ్వారు.

''పెనరోజీ మహరాజు గారి కొలువులో మా పూర్వీకులుండేవారు. పెనాల వంటి తాళపత్ర గ్రంథాలలో 'అపూర్వ పెసరరాగం గళు' అని ఒక అధ్యాయాన్ని మా పూర్వీకులు రాసిపెట్టి పోయారు. అమ్మాయి తంజావూరు వెళ్లినపుడు దాని ప్రతిని తెచ్చింది" అన్నాడు శంకరం వినమ్రంగా.

"చాలా అదృష్టవంతులు మీరు" అన్నాడు గోపేశ్వర రావు తన్మయంగా.

"అబ్బాయి మీరూ తోట్టకం వంటి ఈ పెసరట్టకం విని బాగుందంటే మాకు అదో తృప్తి" అని శంకరం పెసరలక్ష్మికేసి చూశాడు.

కుదురుగా పెళ్లికూతురు పెసరలక్ష్మి పాడసాగింది. ముందు స్వరాలు పాడింది.

"ప.. సరి.. గ.మ.నీ...
గ.. రి.మ.ప.స.నీ..."

వెంటనే పెసరేశ్వరరావు ఆనందంతో,

"భలే పసరికరాగజన్యం. ధైవతం విసర్జించారు. ఆహాఁ

ఆరోహణలో కోమల గాంధారం" అన్నాడు.

అవునన్నట్లుగా పెసరలక్ష్మి కళ్లు చికిలించి ఆలాపనగా అకారం పట్టింది.

"తీవ్ర మధ్యమం. బాగుంది. మానుష భూషణి రాగం కదా!" అన్నాడు పెసరేశ్వరరావు.

''కానీ - మానుషి - అని మాత్రమే అపూర్వరాగంగళులో ఉంది. గళు అంటే తులు భాషలో మాల అనే అర్థంట" అంది పెసరలక్ష్మి పాడుతున్న మూడులోనే.

"పల్లవి ఏమిటో తెలుసుకోవచ్చా" అన్నాడు పెసరేశ్వరరావు.

"తెట్టు పల్లవి అని చిన్న పల్లవి. మీరు ఆనందించేదే. ఆనాటికే అక్కడ పెసర పెనాలుండేవేమో" అని నవ్వింది.

"ఏమిటి పల్లవి?" అన్నాడు పెసరేశ్వరరావు.

పెసరలక్ష్మి పాడసాగింది.

"జలేశుచి బీజే
పెనైకధారుణీ
మాడే రుచిమాడే
విషాద కారుణీ"

అని రాగంలో అని, "పల్లవి రెండు చీలిన జీలకర్రలు వదలి ఎత్తుగడ సమం నుంచి తిశ్రగతి నడక" అని తాళం చూపి పాడసాగింది.

పెసరేశ్వరరావు పులకించిపోయి తాను కూడా "రుచిమాడే విషాదకారుణీ" అని కలిసిపోయాడు.

శంకరం గారికి మనసంతా తేలిపోయినట్లయింది.

"ఇది మానుషి రాగమా! ఎంతో గొప్పగా వుందిరా అబ్బాయి" అన్నాడు గోపేశ్వరరావు.

"నిజానికి మానుష భూషణి అంటారు నాన్నా"

## దీపావళి

మతాబుల పండుగ
మతాలను చెరిపే పండుగ
కులాలను తరిమే పండుగ
శాంతి గీతానికి పండుగ
జనం సమైక్యతకు నిండుగ
కావాలి దీపావళి పండుగ!

- త్రినాథ్

అన్నాడు పెసరేశ్వరరావు.

"రిగమనీలో 'రి'ని చతుర్శ్రుతి రుషభం చేశాను. అందుకే వ్యాకుల మధ్యమం అని పేరు పెట్టాను" అంది పెసరలక్ష్మి.

"నిజమే. విషాదకారుణి కదా! మీరు పెట్టిన పేరే బాగుంది" అన్నాడు పెసరేశ్వరరావు.

ఈ తీరు అంతా చూసిన పెళ్లికూతురు తల్లికి ఆనందంగా వుంది.

అంతా లేచారు. శంకరంగారు భార్యకేసి చూశాడు. ఆవిడ బొట్టు తెచ్చింది. చిన్న బంగారు బొట్టు, పెసర గింజంత బొట్టు తీసింది. ఆ బొట్టుని పెసరేశ్వరరావు తల్లికి తిలకంగా పెట్టింది. పెసరేశ్వరరావు తల్లి తిలకం మనసు పరవశించిపోయింది.

"మీది ఇంత పెసర సంస్కారం గల కుటుంబం అనుకోలేదు బావగారూ" అంటూ గోపేశ్వరరావు కన్నులలో బాష్పాలు కుక్కుకొన్నాడు.

"ఆగండి బావగారూ!" అంటూ శంకరం అలమారులోంచి చిన్న వెండి పెనం తీసి మూడుసార్లు కొట్టాడు. శుభం!

ఈ మా చిరుకానుక స్వీకరించండి.

"కన్నెగ్గాళ్ పాండురాజు కాలంలో పెనాలు వాడవాడలా అమ్మేవారట. దాని నమూనా ఇది. తెలుగునాడు నుండి మన పెసర వంటవారు ఆనాడు అక్కడికి వలస వెళ్లారు. పాతోళివాక్కంలో వున్నప్పుడు పెన్నాళ్వారులు నాకు దాని నమూనాలుగా అమ్మారు. అక్కడి నుంచి తెచ్చాను" అని వెండి పెనం ఇచ్చాడు శంకరం గోపేశ్వరరావుకి.

గోపేశ్వరరావు మురిసిపోతూ నాలుగు అంగుళాల ఆ వెండి పెసర పెనం అనే శిబ్బిని కళ్లకు అద్దుకున్నాడు. నమస్కరించాడు. ఇక మాటలు ఏముంటాయి. కొడుక్కి పెనం చూపించాడు.

కానీ పెసరేశ్వరరావుకి మనసు పెనం మీద లేదు. పెసరరాగ పల్లవి కవ్వతో కనులు కలసిపోతున్నాయి. చూపులు వదలలేక బయటకి వచ్చాడు.

పెసరలక్ష్మి చూపులు రెండడుగులు విడిచి వెనుకకు, ఎత్తుగడ ముందుకు సాగుతోంది కానీ, సిగ్గుతో అక్కడే ఆగిపోయింది.

ఇంతలో కంగారుగా పెసరేశ్వరరావు ముక్కుపుటలు ముడిచి, "అమ్మో! మాడిపోతోంది. పెనం మీద అట్టు అలానే ఉంచినట్టున్నారు. వాసనేస్తోంది. వెళ్లండి" అని అరిచాడు.

పెసరలక్ష్మి వెంటనే వంటగదిలోకి పరుగెత్తింది.

"చూశారా! మావాడి పెసర ధ్యాన. ఇట్టే పసిగట్టెయ్యగలడు" అన్నాడు గోపేశ్వరరావు శంకరంతో తాపీగా.

"మీవాడు వరపెసర పుత్రుడు. మనం ఇంతమంది ఉన్నాం. చూశారా, అబ్బాయికే వాసన తెలిసింది. కారణజన్ముడు" అన్నాడు శంకరం పైకి నమస్కారం చేస్తూ.

"నిజమే అన్నగారూ! మావూరి పెసరాంబ చలువ వలన వీడు నా కడుపున పడ్డాడు" అంది తిలకం, పెసరేశ్వరరావుకేసి అభిమానంగా చూస్తూ.

పెసరేశ్వరరావు లోపలికి చూస్తూనే ముందుకు నడిచాడు.

★★★

అలాటి గది అలా ఎవరూ అలంకరించి వుండరు. అన్నీ పెసర తీగలు. ప్రక్క అంతా పెసర గింజలు, పెసర ఆకులు. ఆ గది అంతా పెసరపిండి గుభాళింపు. ఇంగువ ఘుమఘుమ వాసన. పచ్చటి పెసర చేను రంగులో పెసరలక్ష్మి అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వచ్చింది.

పెసరేశ్వరరావు ఇక ఆగలేకపోయాడు. ఒకే చేత్తో పెసరలక్ష్మి నెమ్మది అన్నట్లు సైగ చేస్తూ పెసర పచ్చడి ఉన్న వెండి గిన్నె ప్రక్కనే టేబిల్‌పైన పెట్టింది.

కళ్లు మూసుకుని పెసరేశ్వరరావు "ఏమిటి పాల గ్లాసుతో ఇంత లేటుగా వచ్చావు" అన్నాడు.

"పాల గ్లాసు కాదు, నేను తెచ్చింది- పెసర పచ్చడి. రుబ్బటంలో కాస్త లేటు అయింది" అంది పెసరలక్ష్మి.

"నిజమే! నిజంగా పెసర పచ్చడా! ఏది?" అన్నాడు కళ్లు మూసుకుని.

పెసరలక్ష్మి అతని వెనుక నుంచి అతనిని హత్తుకుని కళ్లు మూసింది.

"ఇప్పుడు కళ్లు తెరవండి" అంది.

"కారం... కారం... కళ్లు మంట..." అంటూ కెవ్వుమని అరిచాడు పెసరేశ్వరరావు.

"అయ్యో! గట్టిగా అరవకండి. ఎవరైనా వింటే నవ్వుతారు. నిజమైన పెసర భక్తులకు ఇది మంటగా ఉండకూడదు" అంది.

"మండిపోతోంది మరి" అన్నాడు పెసరేశ్వరరావు.

"కాస్త ఓర్చుకోండి. పెసర పచ్చడి నేనే రుబ్బి తెచ్చాను. చేతులకు మిరపఘాటు అంటుకుంది" అంది పెసరలక్ష్మి.

"చేతులు కడుక్కోలేదా...!" అన్నాడు పెసరేశ్వరరావు.

"హుష్ ఇదిగో పెసరాంజనం. కళ్లకు రాసుకుంటే తగ్గిపోతుంది" అంటూ పెసరలక్ష్మి పెసరేశ్వరరావు కళ్లకు అంజనం రాసి "పెసరబామ్! మంట మాయం" అంది నవ్వుతూ.

"అరే గాయబ్! మంట ఇట్టే మాయమయింది" అన్నాడు పెసరేశ్వరరావు.

"ఎటువంటి మంటలయినా, మాయని గాయాలైనా రెండు నిముషాలలో పెసరబామ్ మాయం చేస్తుంది. పెసిలీనియా దీవులలో పేటెంటుకి అప్లయి చేశాను. ఏడాదిలో మార్కెట్టు చేయవచ్చు" అంది పెసరలక్ష్మి.

ఆ గదిలో దంపతులిద్దరు పెసర పచ్చడి తింటూ కబుర్లు చెప్పుకున్నారు. కాసేపటి తర్వాత పెసర పూర్ణం బూరెలు తింటూ నాలుగు చిన్న చిన్న భరిణెలు తీశాడు పెసరేశ్వరరావు. కంది గింజ వంటి పెసర గింజలు. రకరకాల సైజుల్లో వున్నాయి.

"ఈ హైబ్రిడ్ విత్తనాలు నాటితే జీడి గింజలవుతాయి. వీటితో సంపూర్ణ దినుసు విప్లవం సాధించవచ్చు. చూడు!" అంటూ లాప్‌టాప్ తీసి ఓ మీట నొక్కాడు పెసరేశ్వరరావు.

కంప్యూటర్ తెరమీద "పెసర సాఫ్ వెల్‌కం!" అని కనబడింది. మరికొన్ని మీటలు నొక్కి మౌస్ సర్దాడు. ఒక్కసారి ధాన్యాగారమంతా పెసర బస్తాలుగా నిండిపోయే పథకాలు స్కీములు కనబడసాగాయి. పెసరలక్ష్మి ఆశ్చర్యానికి అంతే లేకపోయింది.

"ఆగండి" అంటూ పెసరలక్ష్మి తన గుండెల్లోంచి చిన్న పాకెట్ సైజు భరిణె తీసింది. నడుముపై సర్దుకుని పెసర తీగలాంటి తీగ లాగింది. పెసరేశ్వరరావు కళ్లు మూసుకోబోయాడు.

"అబ్బే అదేంలేదు. కంగారుపడకండి" అని బాక్సుకు ఆ వైరు కనెక్టు చేసి, కంప్యూటర్‌కి కనెక్టు చేసింది. ఏదో ప్రోగ్రాం మీటలు నొక్కింది. అందులో పెసరగిరి వచనాలు, పెసర రత్నాకరం, అష్టోత్తరాలు, పెసర విటమిన్స్ సామాన్యులకు, మాన్యులకు అంటూ వివరాలు, పెద్దవారు-పెసర ఆహారాలు అన్న గ్రంథసూచి- అన్నీ వచ్చాయి.

"ఇవన్నీ సంపూర్ణ పెసర విప్లవం సాధించే పథకాలు. పెసర సంస్కృతిని పెంపొందింప చేసే ప్రజా వినియోగ ఉద్యమాలు- నా జీవితాశయాలు. వియ్ ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్" అంది గోముగా.

పెసరేశ్వరరావు పెసరలక్ష్మిని దగ్గరకు తీసుకున్నాడు "ఇక రక్షణ పెసరు తీగలు ఇక్కడ ఏమీ లేవుగా" అంటూ ఆమె నడుం చుట్టూ చేయి వేశాడు.

"దిసీజ్ పెసరేశ్వరరావు" అంటూ కంప్యూటర్ పవరు తీసేశాడు.

కుమార పెసర సంభవం అనే జీవనాటకం మొదలయింది- ఎవరికీ కనబడని దృశ్యాలతో.

*ఫల శృతి*: ఈ కథ చదివిన వారికి, విన్న వారికి అపరత్వం సిద్ధిస్తుందని మొలకానంద మహర్షి సెలవిచ్చారు.

## నిర్వస్త్ర ప్రపంచం

బాసలు లేవు
భాషకు ఏ యిబ్బందీ లేదు
అంతుపట్టనితనమేదో
అనంతమై అలికిడి చేస్తూనే వుంటుంది

ఎవరినీ ఎవరూ వెతకక్కర్లేదు
తమని తాము వెదుక్కుంటే; కనుక్కుంటే
అందరూ దొరికిపోతారు

అన్నీ తెలుసని కాదు
కొన్నైనా తెలుసునని తెలుసు
ఈ తెలిసినతనమేదో
తెలియకుండా వుండటమెట్లాగో
యిప్పుడు తెలుసుకోవాలి

అందరూ వెళ్లిపోతారు
అందర్నీ వదిలిపెట్టి
చివరికి
తనను తాను కూడా యిక్కడే వదిలి

ఆరున్నొక్క పాదముద్రలను ఒకే మాలకట్టి
తలపు వాకిట తోరణం కట్టాను
లోపలికి అడుగుపెట్టే వారికి
అన్నీ నిర్వస్త్ర ప్రపంచాలే.

– జుగాష్‌విలి